

రైతుల కోసమే గోదాంలు

రైతుల కోసమే గ్రామాల్లో గోదాంలు నిర్మిస్తున్నామని నాబార్డు రాష్ట్ర ఈఈ గోపాల్‌రావు అన్నారు. - 8లో



బుద్ధవనం సందర్శన

అటవీశాఖ రీజనల్ డైరెక్టర్ త్రినాథ్‌రావు బుధవారం నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని సందర్శించారు. - 8లో

గరిష్టం/కనిష్టం 35°/18°

వాతావరణం

ఆకాశం ఉదయం పొగమంచుతో మేఘావృతంగా ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఉపాధి కూలీలకు పనులు కల్పించేలా ప్రణాళిక



పనులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ సురేష్

మునగాల(కోదాడ): వచ్చే వేసవిలో ప్రతి గ్రామంలో ఉపాధి కూలీలకు ముమ్మరంగా ఉపాధి పనులు కల్పించే విధంగా అధికారులు ప్రణాళికలు తయారుచేయాలని జిల్లా పరిషత్ సీఈఓ జి.సురేష్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని శివాలయం వద్ద నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పదవ విడత చేపట్టే హరితహారం కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న నర్సరీని తనిఖీ చేశారు. నర్సరీ నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం తెలంగాణ క్రీడా ప్రాంగణం ఏర్పాటు కోసం స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.వెంకటేశ్వర్లు, ఎంపీఓ భూపాల్‌రెడ్డి, ఎంపిపి ఎలక బిందు , స్థానిక సర్పంచ్ చింతకాయల ఉపేందర్, ఏపిఓ శైలజ, ఈసీ కళ్యాణ్, టిఏ శేఖర్, ఫీల్డు అసిస్టెంట్ నారగాని కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



వరి పంటను పరిశీలిస్తున్న డీఏఓ

పెన్‌పహాడ్: వరి పంటలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి రామారావు నాయక్ కోరారు. బుధవారం మండల పరిధిలోని పొట్లపహాడ్ గ్రామంలో వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటలో కాండం తొలుచు పురుగు ఆశిస్తోందన్నారు. నివారణకు కార్టాఫ్ హైడ్రోక్లోర్ 2గ్రాములు లేదా క్లోరంట్రిప్రోలే 0.3 మిలీ లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి. కృష్ణసందీప్, రైతులు రామినేని కృష్ణయ్య, ఎల్లమ్మ, వెంకన్న, నారాయణ, పీతాంబర్‌రెడ్డి, నారాయణ జగన్‌రెడ్డి, గొబ్బి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం వైఖరి సరికాదు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

కోదాడఅర్బన్ : సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ వైపు మళ్లిన రాష్ట్రాల పట్ల కేంద్రం వైఖరి వివక్షపూరితంగా ఉండడం సరికాదని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బంధం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం కోదాడ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సంఘం అధ్యక్షుడి అధ్యతన ఎస్‌టీయూ జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఈహెచ్‌ఎస్ అమలుకు ఉద్యోగ, ఉపాధ్యాయులతో ప్రత్యేక కమిటీ వేసి వారి సంక్షేమానికి కృషి చేస్తామని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. 10వేల పీఎస్ హెచ్‌ఎం పోస్టులను నింపాలని, పండిట్, పీఈటీ పోస్టులను ఉన్నతీకరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓరుగంటి నాగేశ్వరరావు, రాష్ట్ర మహిళా కో కన్వీనర్ ఎం. వెంకటరమణ, జిల్లా ఆర్థిక కార్యదర్శి రూప్లనాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు గుండు ఆదినారాయణ, కందుల కిరీటం, జిల్లా కార్యదర్శి భిక్షం, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు రామచంద్రారెడ్డి, లోకేష్, యలగొండ శ్రీనివాస్, సాది సురేష్, సుదర్శన్, యల్లయ్య, ఉపేందర్, సురేష్ పాల్గొన్నారు.

అర్చక సంఘం ప్రధాన కార్యదర్శిగా ఫణికుమారశర్మ



నేరేడుచర్ల : రాష్ట్ర దూప, దీప, నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నేరేడుచర్ల మండలం దిర్శించర్ల గ్రామానికి చెందిన అన్నంబొట్ల ఫణికుమారశర్మ నియమితులయ్యారు. బుధవారం యాదగిరిగుట్టలోని లక్ష్మీనర్సింహస్వామి దేవాలయ సన్నిధిలో రాష్ట్ర అర్చక సంఘం సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవశర్మ ఆయనకు నియామక పత్రం అందజేశారు. తన నియామకానికి సహకరించిన వారందరికీ ఫణికుమారశర్మ కృతజ్ఞతలు తెలిపారు.

కేసారం చేరిన దేవరపెట్టె



లింగమంతుల స్వామి దర్శనం కోసం బారులుదీరిన భక్తులు



పెద్దగట్టు నుంచి దేవరపెట్టెను కేసారం గ్రామానికి తరలిస్తున్న యాదవులు



బోనం వండుతున్న మున్న, మెంతబోయిన వంశస్థులు

దురాజ్‌పల్లిలోని శ్రీ లింగమంతుల స్వామి (గొల్లగట్టు) జాతరకు నాలుగో రోజూ భక్తులు భారీగా తరలివచ్చారు. నెలవారం కార్యక్రమాన్ని మున్న, మెంతబోయిన వంశస్థులు సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. లింగమంతుల స్వామి, చౌడమ్మ తల్లికి బోనం వండి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం దేవరపెట్టెను కేసారం గ్రామానికి తరలించి దేవరగుడిలో పెట్టి పూజలు చేశారు.

–సూర్యాపేట, చివ్వెంల 8లో

11న జాతీయ మెగా లోక్ అదాలత్

- రాజీమార్గమే రాజమార్గం
- జిల్లా జడ్జి గౌతమ్‌ప్రసాద్
- జాతరలో లోక్ అదాలత్‌పై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా జడ్జి గౌతమ్‌ప్రసాద్

చివ్వెంల (సూర్యాపేట) : జిల్లా కోర్టులో ఈ నెల 11న జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.గౌతమ్‌ప్రసాద్ తెలిపారు. బుధవారం చివ్వెంల మండల పరిధిలోని దురాజ్‌పల్లి శ్రీ లింగమంతుల స్వామి ఆలయ ప్రాంగణంలో లోక్ అదాలత్‌పై పారా వలంటీర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రాజీమార్గమే రాజమార్గమన్నారు. సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం వృథా చేసుకోవడమే కాకుండా, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారు కేసులను పరిష్కరించుకోవాలన్నారు. తొలిసారి రాష్ట్రంలోనే జాతరలో లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించడం పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేశారు. న్యాయమూర్తులను దేవాదాయ ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్‌జడ్జి శ్రీవాణి, జూనియర్ సివిల్ జడ్జి కె.సురేష్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జె.ప్రశాంతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోండ్రాల అశోక్, సీనపల్లి సోమేశ్వర్, డీఎస్పీ నాగభూషణం, జె.శశిధర్, వసంత సత్యనారాయణపిళ్లేయాదవ్, బొల్లెద్దు వెంకటరత్నం, కాకి రాంరెడ్డి, జటంగి వెంకటేశ్వర్లుయాదవ్, కోక రంజిత్‌కుమార్, తల్లమల్ల హస్సేన్, యాదగిరి, తండు సైదులుగౌడ్, రాముడు, కిషోర్, లతీఫ్, ఇబ్రహీం పాల్గొన్నారు.

చెత్తకుప్పల మధ్య ఎలా చదువుకుంటారు

- జాజిరెడ్డిగూడెం ప్రైమరీ స్కూల్ ఆవరణలో చెత్త ఉండడంపై కలెక్టర్ ఆగ్రహం
- ఎంపీఓ, హెచ్‌ఎం, పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసులు జారీ



జాజిరెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాలలో చిన్నారితో పాఠం చదివిస్తున్న కలెక్టర్

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెంలోని ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ వెంకట్రావు బుధవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడడమే గాక పాఠాలు సైతం చదివించారు. చదువుల్లో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కాగా పాఠశాల ఆవరణ చెత్తతో నిండిపోవడంతో హెచ్‌ఎంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చెత్తకుప్పల మధ్య పిల్లలు ఎలా చదువుకుంటారని ప్రశ్నించారు. దీంతో ఎంపీఓ సందీప్‌కుమార్, హెచ్‌ఎం సుధాకర్, పంచాయతీ కార్యదర్శి నెహ్రూలకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు చెప్పారు. మన ఊరు–మన బడి పథకం కింద నిర్మిస్తున్న అదనపు గదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. ఈ పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

అలాగే జాజిరెడ్డిగూడెంలోని కంటి వెలుగు శిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొంతమందికి అద్దాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 18ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకొని అవసరమైనవారు మందులు, అద్దాలు పొందాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా కంటి వెలుగు కార్యక్రమం ముమ్మరంగా సాగుతోందని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ పి. యాదగిరిరెడ్డి, కంటి వెలుగు వైద్యాధికారి డాక్టర్ చినపాక మణిరత్నం, ఎంపీఓ సందీప్‌కుమార్, హెచ్‌ఎం సుధాకర్, సూపర్‌వైజర్ వెంకట్రావమ్మ, కార్యదర్శి నెహ్రూ, హెల్త్ అసిస్టెంట్ కుంభం వీరయ్య, వీఆర్‌ఏ విజయ్, ఏఎన్‌ఎంలు సైదమ్మ, శకుంతల, కంటి వైద్య నిపుణుడు ఎ. వేణు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

నాగారం : ప్రభుత్వ భూములను గుర్తించి అవి అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని కలెక్టర్ వెంకట్రావు సూచించారు. బుధవారం మండల కేంద్రంలో నిర్మిస్తున్న రైతువేదికను సందర్శించి మాట్లాడారు. అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను గుర్తించి తిరిగి సర్కారు ఆధీనంలోకి తేవాలన్నారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం నాగారంలో ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలించి, ప్రభుత్వ భూములకు సంబంధించిన భూరికార్డులను పరిశీలించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ మోహన్‌రావు, ఆర్డీఓ రాజేంద్రకుమార్, భూ సర్వే జిల్లా అధికారి నాగేందర్, తహసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్, ఆర్‌ఐ లక్ష్మీనర్సింహారావు, ఎంపీఎస్‌ఓ చింతమల్ల రమేష్, ఏఓ గణేష్, పంచాయతీ రాజ్ ఏఈఈ రవి ఉన్నారు.

మహిళా సంఘాలకు జనరిక్

- మండలానికి రెండు జనరిక్ మందుల దుకాణాల ఏర్పాటు
- ఒక్కో దుకాణానికి స్త్రీ నిధి నుంచి రూ. 3 లక్షల రుణం
- మహిళల ఆర్థిక స్వావలంబన, పేదలకు తక్కువ ధరకు ఔషధాలు అందించడమే లక్ష్యం



హుజూర్‌నగర్: స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక స్వావలంబనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయి. కుటీర పరిశ్రమల ఏర్పాటుకు స్త్రీనిధి బ్యాంకు నుంచి రుణ సదుపాయం కల్పిస్తూ తోడ్పాటునందిస్తున్నాయి. ఇందులో భాగంగా మహిళా సంఘాల సభ్యులు జనరిక్ ఔషధాల(మందుల) దుకాణాలు ఏర్పాటు చేసుకునేలా అవకాశం కల్పించారు. తద్వారా మహిళలు ఆర్థికంగా బలోపేతం చేయడమే కాకుండా నిరుపేదలకు తక్కువ ధరకు మందులు అందజేయాలని భావిస్తోంది. ఈనేపథ్యంలోనే గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా స్త్రీనిధి రుణాలు మంజూరు చేసి జనరిక్ మందుల దుకాణాలను ఏర్పాటు చేయనున్నారు. దీని కోసం ప్రతిపాదనలు కూడా సిద్ధమయ్యాయి.

దుకాణానికి రూ 3 లక్షల రుణం

జిల్లా వ్యాప్తంగా జనరిక్ ఔషధాల (మందుల) దుకాణాలను అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా యంత్రాంగం ముందుకు సాగుతోంది. దీనిలో భాగంగా మహిళా సంఘాల సభ్యుల్లో అర్హులైన వారికి జనరిక్ దుకాణాల ఏర్పాటుకు స్త్రీనిధి ద్వారా రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని నిర్ణయించింది. ఒక్కో దుకాణం ఏర్పాటుకు రూ 3 లక్షల రుణం అందించనున్నారు. తొలుత మండలానికి రెండు దుకాణాల చొప్పున ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటిలో ఒకటి మండల కేంద్రంలో మరొకటి మేజర్‌పంచాయతీలో ఏర్పాటు చేయనున్నారు.

నిరుపేదలకు తక్కువ ధరకు మందులు అందించడానికి..

గ్రామాలు, మండలాల్లో రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయి. రోజువారీ పనికి పోతేనేగానీ కుటుంబ పోషణ సాగని పరిస్థితులు వారివి. ఇలాంటి కుటుంబాల్లో ఎవరైనా అనారోగ్యానికి గురైతే వారు పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఒక వేళ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లినా ఎక్కువ శాతం మందులు బయట దుకాణాల్లో కొనాల్సి రావడంతో వారికి భారీ వ్యయం తప్పడం లేదు. ఈ నేపథ్యంలో అటువంటి వారికి తక్కువ ధరలకు మందులు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మండలాల్లో జనరిక్ ఔషధాల (మందుల) దుకాణాలను ఏర్పాటు చేయాలని సంకల్పించింది.

ఔషధ దుకాణాల ఏర్పాటుకు అర్హతలు ఇలా..

- జనరిక్ ఔషధాల దుకాణం ఏర్పాటుకు స్వయం సహాయక సంఘాల్లో సభ్యురాలై ఉండాలి. వారి దగ్గరి బంధువుల్లో ఎవరైనా డీ ఫార్మసీ, బీ ఫార్మసీ, ఎం. ఫార్మసీ విద్యార్హత కలిగి ఉండాలి.
- రుణం పొందడానికి ముందు సభ్యురాలిగా ఉన్న సంఘం గ్రామైక్య సంఘం తీర్మానం తప్పనిసరి.
- దుకాణం నిర్వహణకు సంబంధిత డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అనుమతి, ధ్రువీకరణ పత్రం, కొటేషన్, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో స్త్రీనిధి అధికారులకు దరఖాస్తు చేయాలి.
- స్త్రీనిధి అధికారులు దరఖాస్తులను పరిశీలించి అర్హులుగా భావిస్తే వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేస్తారు.
- జనరిక్ దుకాణం ఏర్పాటు కోసం తీసుకునే రుణాన్ని ఐదేళ్లలోపు ప్రతి నెలా వాయిదాల రూపంలో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది.

మహిళా సంఘాల సభ్యులు వినియోగించుకోవాలి



మండలానికి రెండు జనరిక్ ఔషధ దుకాణాలను ఏర్పాటు చేయాలని సంకల్పించాం. అందుకు మహిళా సంఘాల సభ్యులకు అవకాశం కల్పిస్తున్నాం. మహిళా సంఘాల సభ్యులు దీనిని సద్వినియోగం చేసుకోవాలి.

– చాదా వేణుగోపాల్‌రెడ్డి, స్త్రీనిధి, రీజినల్ మేనేజర్

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీధర్

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందుతున్న అభ్యర్థులు వారికి వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ స్టడీ సర్కిల్ రాష్ట్ర డైరెక్టర్ శ్రీధర్ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో అన్ని రకాల పోటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణ అందిస్తున్నామని, ప్రభుత్వం విడుదల చేసిన ఉద్యోగ నోటిఫికేషన్లలో కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించాలని సూచించారు. పేద, మధ్య తరగతి అభ్యర్థులకు ఉపయోగపడే విధంగానే స్టడీ సర్కిళ్లను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, పోటీ పరీక్షల కోసం ప్రైవేట్‌కు దీటుగా శిక్షణ తరగతులు, భోజన వసతులను కల్పిస్తున్నామన్నారు. శిక్షణ పొందిన అభ్యర్థులకు అనంతరం స్టడీ మెటీరియల్ కూడా అందిస్తున్నామని, అది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమశాఖ అధికారిణి దయానందరాణి, స్టడీ సర్కిల్ డైరెక్టర్ రాములు తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లి క్షేత్రంలో నిత్య కల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని బుధవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, ప్రత్యేకార్చనలు చేశారు. అనంతరం స్వామి అమ్మవార్లకు అష్టోత్తర సహస్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. నూతన పట్టు వస్త్రాలతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదాన్ని రక్తికట్టించారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరనం , మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో వేదమంత్రోచ్చరణలతో కల్యాణతంతు ముగించారు. నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించారు.

బీజేపీ అధికారంలోకి రాగానే ఉచిత విద్య, వైద్యం



తిరుమలగిరిలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు

తిరుమలగిరి (తుంగతుర్తి) : రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే ప్రతి ఒక్కరికీ ఉచితంగా విద్య, వైద్యం అందిస్తామని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. తిరుమలగిరిలో ఆ పార్టీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, మొదటి సంతకం ఉచిత విద్య, వైద్యం పైనే పెడతారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను బీఆర్‌ఎస్ విస్మరించిందని ఆరోపించారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ల్యాండ్, శాండ్ మాఫియా సాగుతోందని ఆరోపించారు. జిల్లాలో రూ.1100 కోట్ల ధాన్యం కుంభ కోణం జరిగిందన్నారు. తిరుమలగిరి మండలం గుండెపురి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఓ నాయకుడు అక్రమంగా తన అకౌంట్‌లో డబ్బులు వేసుకున్నాడని ఆరోపించారు. ఈ నెల 10 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించే కార్నర్ సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య, పల్లె పాక సాయిబాబా, వై.ధీన్‌దయాళ్, యాదగిరి, వెంకటేశ్వర్లు, యాకవరెడ్డి, సోమయ్య పాల్గొన్నారు.

బీపీ, షుగర్ బాధితులకు కిట్లు

- 89 వేల మంది వ్యాధిగ్రస్తుల గుర్తింపు
- త్వరలో ఇంటింటికీ తిరిగి పంపిణీ
- ఏర్పాట్లు చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ



పంపిణీ చేయనున్న ఎన్‌సీడీ ఆరోగ్య కిట్టు

హుజూర్‌నగర్: దీర్ఘకాలిక వ్యాధులైన రక్తపోటు, మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఎన్‌సీడీ (నాన్‌కమ్యూనికేబుల్ డీసీజెస్)కు కిట్ల రూపంలో మందులను నేరుగా బాధితుల ఇంటికి వెళ్లి ఉచితంగా అందించాలని భావించింది. అందుకు తగిన కార్యాచరణను రూపొందించింది.

ప్రతి నెలా అందజేయాలని..

జిల్లాలో ఆశాకార్యకర్తలు ఇంటింటికీ తిరిగి రక్తపోటు (బీపీ), మధుమేహ (షుగర్)వ్యాధిగ్రస్తులను గత ఆగస్టు నెలలో గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా 30 ఏళ్లు దాటిన వారు 5,67,110 మంది ఉన్నారు. వారిలో అధిక రక్తపోటు వ్యాధి అనుమానితులు 57,225 మంది ఉంటే వారిలో 55,134 మందికి రక్తపోటు నిర్ధారణ అయింది. కాగా మధుమేహ వ్యాధి అనుమానితులు 34,115 మంది ఉండగా వారిలో 34,019 మందికి మధుమేహ వ్యాధి నిర్ధారణ అయింది. మొత్తం కలిపి 89,153 మంది తేలారు. వీరిలో చాలా మంది ప్రతి నెలా ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు తీసుకుంటున్నారు. కాగా వీరికి ప్రతి నెలా మందుల కిట్లను (సంచులు) అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా జిల్లాలో ఎన్‌సీడీ కిట్ల పంపిణీని త్వరలో ప్రారంభించనున్నారు. ఇప్పటికే 82 వేల కిట్లు డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి చేరుకున్నాయి.

సర్వే వివరాలు ఎన్‌సీడీ పోర్టల్‌లో నమోదు

జిల్లాలో రక్తపోటు, మధుమేహం వివిధ రకాల క్యాన్సర్లతో బాధపడుతున్న వారు 89 వేల పైచిలుకు మంది ఉన్నట్లు గుర్తించారు. వారిలో క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు హైదరాబాద్‌లోని ఎం అండ్ జే క్యాన్సర్ హాస్పిటల్, ఇతర క్యాన్సర్ ఆస్పత్రుల్లో పరీక్షలు చేయించి మందులు అందిస్తున్నారు. మధుమేహం, రక్తపోటు వ్యాధిగ్రస్తులు ముఖ్యంగా 30 ఏళ్లకు పైబడిన వారి వివరాలు ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్) పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. సంబంధిత పీహెచ్‌సీ వైద్యాధికారులు వివిధ ఉప కేంద్రాల నుంచి వచ్చిన వారిని పరిశీలించి రక్తపోటు, మధుమేహాన్ని నిర్ధారణ చేస్తారు. అనంతరం వారికి వైద్య సేవలు, మందుల పంపిణీ అయ్యే విధంగా ఏర్పాట్లు చేస్తారు.

రోగులు సులువుగా గుర్తించేలా..

రోగులు మందులను సులువుగా గుర్తించేలా ఏర్పాటు చేశారు. ఈ కిట్టులో ఉదయం, మధ్యాహ్నం, రాత్రి అని రాసి వేరువేరు రంగులతో మూడు చిన్న అరలు లోపల ఉండేలా తయారు చేశారు. ఏసమయంలో ఏ మాత్రలు వేసుకోవాలో వాటిని ఆయా సంచుల అరల్లో దాచుకునే ఏర్పాట్లు ఉన్నాయి.

రోగులకు ఉపయోగకరం



ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఈ ఎన్‌సీడీ కిట్లు రక్తపోటు, మధుమేహ వ్యాధి ఉన్న వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. వృద్ధులు, నిరక్షరాస్యులు ఏ సమయంలో ఏ మందులు వేసుకోవాలో అందులోనే వివరంగా ఉంటాయి. అందువల్ల వారు క్రమం తప్పకుండా మందులు వాడే అవకాశం ఉంది. దీంతో వారి రక్తపోటు, మధుమేహం అదుపులో ఉంటుంది.

– డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, అసంక్రమిత వ్యాధుల నియంత్రణ జిల్లా అధికారి

నెలవారం.. జనహోరం



స్వామి వారిని దర్శించుకుని మెట్లపై నుంచి కిందికి వస్తున్న భక్తులు



పెద్దగట్టు జాతర పరిసరాల వ్యూ

నాలుగో రోజూ అదే జోరు

- పెద్దగట్టుకు భారీగా తరలివచ్చిన భక్తులు
- లింగమంతుల స్వామి, చౌడమ్మ తల్లికి నైవేద్యంగా బోనం చెల్లింపు
- కేసారం తరలిన దేవరపెట్టె
- నేడు మకరతోరణం తరలింపుతో జాతర పరిసమాప్తం

సూర్యాపేట/చివ్వెంల: శ్రీ లింగమంతుల స్వామి (పెద్దగట్టు) జాతరకు నాలుగో రోజు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం గంపల ప్రదక్షిణతో వైభవంగా ప్రారంభమైన గొల్లగట్టు జాతరలో బుధవారం భక్తిశ్రద్ధలతో నెలవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని యాదవ పూజారులు మున్న, మెంతబోయిన వంశస్తులు సాంప్రదాయ పద్ధతిలో చేపట్టారు. లింగమంతుల స్వామిని లక్షలాది మంది భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

నెలవారం ప్రత్యేకత ఇదీ..

పెద్దగట్టు లింగమంతుల స్వామి నాలుగో రోజు నెలవారం తంతును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలమందలు, జీవాలను పరీక్షించిన దేవతగా అవతరించిన చౌడమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం చంద్రపట్నం వేసి పూజలు నిర్వహించిన నిద్రఘట్టంలో భాగంగా కేసారం గ్రామానికి చెందిన యాదవ పూజారులు బుధవారం కొత్త బోనం కుండ, గంపలో పూజా సామగ్రి, తొలి గొర్రెను తోలుకుని గట్టుకు చేరుకున్నారు. చంద్రపట్నంపై ఉన్న దేవరపెట్టె వద్ద పూజలు చేశారు. మున్న, మెంతబోయిన వంశస్తులు కొత్త కుండలో బోనాలు వండారు. లింగమంతులు, చౌడమ్మతల్లికి నైవేద్యంగా పెట్టారు. మెంతబోయిన వంశీయులు తెచ్చిన తొలిగొర్రెను పట్నంపై బలి ఇచ్చారు. ఈ తంతు జరుగుతుండగా మరో వైపు బైకాన్లు కథలు చెప్పడంతో దేవాలయం ఉగ్రూతలూగింది. ఆ తర్వాత మాంసాన్ని మూడు భాగాలుగా చేసి ఒక భాగం బైకాన్లకు, మరో భాగం మున్న వంశీయులకు ఇచ్చారు. మిగిలిన భాగం మెంతబోయిన వంశీయులు వంట చేసి ప్రసాదంగా తీసుకున్నారు. అనంతరం చంద్రపట్నం వేసి సమీపంలో నాగులమ్మ పుట్టలో పోశారు. తరువాత చౌడమ్మ, లింగమంతుల స్వామి విగ్రహాలు ఉన్న దేవరపెట్టెను తీసుకుని కేసారం బాటపట్టారు. దీంతో నెలవారం పండుగ ముగిసినట్లు అధికారులు ప్రకటించారు.

తల్లిదండ్రుల చెంతకు 25మంది పిల్లలు

జాతరలో తప్పిపోయిన 25 మంది పిల్లలను శిశు సంక్షేమశాఖ, పౌరసరఫరాల సమాచార శాఖ ఆధ్వర్యంలో తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. పిల్ల లు తమ దగ్గరికి రావడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ముగియనున్న జాతర

నాలుగు రోజులుగా లక్షలాది భక్తులు పూజలు అందుకుంటున్న పెద్దగట్టు లింగమంతుల జాతర గురువారంతో ముగియనుంది. సూర్యాపేట యాదవ బజార్‌నుంచి గట్టుకు తెచ్చిన మకరతోరణం గురువారం తిరిగి స్వస్థలానికి చేరనుంది. మకరతోరణం తీసుకెళ్లడంతో జాతర ముగుస్తుందని యాదవ కుల పూజారులు తెలిపారు.

జాతరను సందర్శించిన నాయకులు

పెద్దగట్టు జాతరను సూర్యాపేట జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక యుగేందర్, పెద్దగట్టు చైర్మన్ కోడి సైదులుయాదవ్, తండు శ్రీనివాస్‌యాదవ్, జటంగి వెంకటేశ్వర్లుయాదవ్, మాజీ చైర్మన్ వసంత సత్యనారాయణపిళ్లే, సుంకరబోయిన శ్రీనివాస్‌యాదవ్, తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.



భేరీల మోతకు నృత్యం చేస్తున్న భక్తులు

ఉదయం మందకొడిగా... సాయంత్రం కిటకిట

నాలుగు రోజులుగా సాగుతున్న జాతరలో సోమవారం మినహా మిగతా రోజుల్లో ఉదయం భక్తుల రద్దీ తక్కువగా ఉంటూ జాతర పరిసర ప్రాంతాలు వెలవెలబోతున్నాయి. మధ్యాహ్నానికి పుంజుకుని రాత్రికి భక్తులతో ఆలయ ప్రాంతాలు కిటకిట లాడుతున్నాయి. ఈ రద్దీతో జాతీయ రహదారిపై కూడా ట్రాఫిక్ స్తంభించి పోతుంది. వ్యాపారాలు కూడా సాయంత్రం బాగా సాగుతున్నాయి.



పెద్దగట్టు జాతరలో భక్తుల కోలాహలం



దేవరపెట్టె వద్ద పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక తదితరులు



నాగుల పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

కంపుకొడుతున్న పెద్దగట్టు పరిసరాలు

పెద్దగట్టుతో పాటు పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. చెత్తాచెదారం ఎక్కడ పడితే అక్కడ వేయడంతో దుర్గంధం వస్తుండడంతో భక్తులు దుర్వాసన భరించలేక పోతున్నారు.

వ్యాపారులకు జరిమానా

జాతరలో పలువురు దుకాణాదారులు అధిక ధరకు కూల్‌డ్రింక్స్, వాటర్‌బాటిళ్లు విక్రయిస్తుండడంతో భక్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో లీగల్ మెట్రాలజీ శాఖ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తనిఖీ చేసి జరిమానా విధించారు.

ప్రసాదాలను పరిశీలించిన ఫుడ్‌సేఫ్టీ అధికారులు

సూర్యాపేట: శ్రీ లింగమంతులస్వామి జాతరలో భక్తులకు ఇచ్చే పులిహోర, లడ్డు ప్రసాదాలను బుధవారం ఫుడ్‌సేఫ్టీ అధికారులు పరిశీలించారు. గాఢమైన పసుపు రంగును పులిహోర, లడ్డూలో కలుపుతున్నట్లు ఫిర్యాదు రావడంతో అప్రమత్తమైన అధికారులు నమూనాలను పరిశీలన నిమిత్తం హైదరాబాద్‌కు పంపించారు. ఆహారభద్రత, తనిఖీ అధికారి కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ లడ్డు, పులిహోర నమూనాలు సేకరించినట్లు తెలియజేశారు. వీరి వెంట సిద్దిపేట జిల్లా ఆహార తనిఖీ అధికారి కృష్ణమూర్తి, యాదాద్రి జిల్లా ఆహార తనిఖీ అధికారి స్వాతి, వనపర్తి జిల్లా ఆహార తనిఖీ అధికారి నీలిమ, లతీఫ్ పాల్గొన్నారు.



ప్రసాదాల తయారీని పరిశీలిస్తున్న అధికారులు

బాగా పనిచేశారు.. కడుపు నిండా తినండి



భోజనాలు వడ్డిస్తున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్

సూర్యాపేటక్రైం: దురాజ్‌పల్లి పెద్దగట్టు జాతరలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి సుధాకర్ పీవీసీ ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేశారు. బుధవారం పోలీసు సిబ్బందికి ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ స్వయంగా భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో డీఎస్పీలు నాగభూషణం, వెంకటేశ్వర్ రెడ్డి, సుధాకర్ పీవీసీ యాజమాన్యం, సీఐ సోమనారాయణ సింగ్, ఎస్సై విష్ణుమూర్తి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తులు అప్రమత్తంగా ఉండాలి: డీఎంహెచ్ఓ

సూర్యాపేట: జాతర సమయంలో పచ్చబొట్లు, టాటూలు వేసే వారి పట్ల భక్తులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ కోటాచలం సూచించారు. పచ్చబొట్లు వేసే వారి వద్దకు ప్రత్యేక బృందాలను పంపించి వారు వేసే విధానాన్ని గమనించారు. పచ్చబొట్లు వేసే వారు కొత్త నీడిల్ ఉపయోగిస్తున్నారా లేదా అని భక్తులుగమనించాలని కోరారు. పాత నీడిల్‌లు వాడవద్దని హెచ్చరించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ హర్షవర్ధన్ పచ్చబొట్లు వేసే విధానాన్ని పరిశీలించారు. వీరి వెంట జిల్లా అసంక్రమిత వ్యాధుల అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి ,భూతరాజు సైదులు తదితరులు ఉన్నారు.



పచ్చబొట్లు వేసే వారిని హెచ్చరిస్తున్న డీఎంహెచ్ఓ కోటాచలం



చలువ పందిళ్ల కింద చల్లగా..

దైవదర్శనానికి వచ్చిన భక్తులకు చలువ పందిళ్లు చల్లని నీడనిస్తున్నాయి. గుట్టపైకి మెట్ల ద్వారా ఎండలో వచ్చిన భక్తులు పైకి రాగానే కాసేపు ఈ పందిళ్ల కింద సేద దీరి దైవ దర్శనం చేసుకుంటున్నారు. అనంతరం తమతో తెచ్చుకున్న ప్రసాదాలను ఈ ప్రాంతంలో సేదదీరుతూ ఆరగిస్తున్నారు.

చిన్నారులు జాలీగా..

జాతరలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌కు భక్తులు వేలాది సంఖ్యల్లో తరలివస్తున్నారు. మధ్యాహ్నం నుంచి క్రమక్రమంగా భక్తుల రాక పెరిగి రాత్రి వరకు ప్రదర్శన శాలలు కిక్కిరిసిపోతున్నాయి. జమున సర్కస్, రంగులరాట్నం, డ్రాగన్ రైలు, బ్రేక్ డ్యాన్స్‌లు ఎక్కువగా రద్దీతో ఉంటున్నాయి. రాత్రి వేళల్లో విద్యుత్ కాంతులతో ఎగ్జిబిషన్ సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి.



కారులో షికారు చేస్తున్న చిన్నారులు

15 వరకు 'నవోదయ' గడువు పెంపు

పెద్దవూర: మండలంలోని చలకుర్తి క్యాంపు జవహర్ నవోదయ విద్యాలయంలో 2023–24 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవటానికి గడువును ఫిబ్రవరి 15వ తేదీ వరకు పొడిగించినట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ స్వర్ణలత ఒక ప్రటకనలో పేర్కొన్నారు. ఇప్పటివరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోని ఆరో తరగతి విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నెల 16, 17 తేదీల్లో ఆన్‌లైన్‌లో తప్పులు సరిచేసుకోవటానికి వెబ్‌సైట్ ఓపెన్ అవుతుందని తెలిపారు. జెండర్(మేల్/ఫీమేల్), కేటగిరీ(జనరల్/ఓబీసీ/ఎస్సీ/ఎస్టీ), ప్రాంతం(అర్బన్/రూరల్), డిజేబిలిటీ, ప్రవేశ పరీక్ష రాసే మాధ్యమంను మాత్రమే మార్చేందుకు అనుమతిచ్చినట్లు తెలిపారు.

'అనురాగ్'లో రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్


అనంతగిరి: తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఆరో ఇంటర్ పాలిటెక్నిక్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌ను స్థానిక అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ప్రారంభంకానున్నట్లు ప్రిన్సిపాల్ డా. ఎంవీ శివప్రసాదరావు తెలిపారు. బుధవారం ఆయన కళాశాలలో మాట్లాడుతూ.. నల్లగొండ, ఖమ్మం, కరీంనగర్, మహబూబ్‌నగర్, మేడ్చల్, సిద్దిపేట, రంగారెడ్డి, మెదక్, వరంగల్ జిల్లాల నుంచి 1250మంది క్రీడాకారులు ఈ స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు. బుధవారం సాయంత్రానికే క్రీడాకారులు అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాలకు చేరుకున్నారని, క్రీడాకారులకు అవసరమైన అన్ని వసతులతో పాటు కోర్టులను సిద్ధం చేశామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆర్‌జేడీ ఏ. పుల్లయ్య, డా. శ్రీనాథ్, ఎమ్మెల్సీ, అనురాగ్ కళాశాల కరస్పాండెంట్ డా. పల్లా రాజేశ్వరరెడ్డి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.



మైదానాలను సిద్ధం చేస్తున్న సిబ్బంది

ఊపందుకున్న ఘాట్ రోడ్డు విస్తరణ పనులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి కొండపైకి వెళ్లే మొదటి ఘాట్ రోడ్డు గతేడాది కురిసిన వర్షాలకు కుంగిపోయింది. దీంతో అధికారులు ఘాట్ రోడ్డును వెడల్పు చేయడంతో పాటు మరమ్మతులు చేపట్టారు. సుమారు రూ.4కోట్లతో 7 మీటర్లు ఉన్న ఘాట్ రోడ్డును 12 మీటర్ల వెడల్పుకు పెంచుతున్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి యాదాద్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో రోడ్డు విస్తరణ పనులు ఊపందుకున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు ఈ పనులను దగ్గరుండి చేయిస్తున్నారు. ఈ నెల చివరి వరకు పనులను పూర్తిచేసి మొదటి ఘాట్ రోడ్డును అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రస్తుతం మూడవ ఘాట్ రోడ్డు గుండా వాహనాలు కొండపైకి రాకపోకలు సాగిస్తున్నాయి.



మొదటి ఘాట్ రోడ్డులో పనులు చేస్తున్న కూలీలు

రైతుల కోసమే గోదాంల నిర్మాణం



గోదామును పరిశీలిస్తున్న నాబార్డు ఈఈ గోపాల్‌రావు తదితరులు

త్రిపురారం: రైతులు కోసం గ్రామాల్లో పీఏసీఎస్ కేంద్రాల వద్ద నాబార్డు సహకారంతో గోదాంలను నిర్మిస్తున్నామని నాబార్డు రాష్ట్ర ఈఈ గోపాల్‌రావు అన్నారు. త్రిపురారం మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామంలో సుమారు రూ.33లక్షల నాబార్డు ఆర్థిక సహకారంతో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న నూతన గోదాంను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఏసీఎస్‌లు రైతులకు ఉత్తమ సేవలు అందిస్తూ, వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పెద్దదేవులపల్లి పీఏసీఎస్ చైర్మన్ మందడి నాగేందర్‌రెడ్డి, నాబార్డు ఏఈ చంద్రశేఖర్, బీడీఓ మణికాంత్, నోడల్ అధికారి సుగుణ, సివిల్ ఇంజనీర్ సీతారామరెడ్డి, సీఈఓ గోవర్ధన్, సైదులు, విష్ణు పాల్గొన్నారు.

బుద్ధవనం సందర్శించిన అటవీశాఖ రీజనల్ డైరెక్టర్

నాగార్జునసాగర్: అటవీశాఖ రీజనల్ డైరెక్టర్ త్రినాథ్‌రావు బుధవారం నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని సందర్శించారు. అమ్రాబాద్ ఫారెస్ట్ రిజర్వ్ పరిధిలో శాఖాపరమైన తనిఖీల్లో భాగంగా ఆయన సాగర్ అటవీ ప్రాంతంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలిస్తూ బుద్ధచరితవనం, ధ్యానవనం, స్థూపవనం, మహాస్థూపాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బుద్ధవనం అద్భుతమైన నిర్మాణమని పేర్కొన్నారు. వీరికి గౌడ్ సత్యనారాయణ బుద్ధవనం చారిత్రక ప్రాధాన్యత గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి రాంబాబు, నాగార్జునసాగర్ ఎఫ్‌డీఓ సర్వేశ్వర్, స్థానిక అటవీ శాఖ అధికారి రమేశ్ పాల్గొన్నారు.



బుద్ధుడి విగ్రహం వద్ద అటవీశాఖ రీజనల్ డైరెక్టర్ త్రినాథ్‌రావు తదితరులు

ప్రసాదం కాంప్లెక్స్ మెట్ల మార్గంలో షెడ్డు నిర్మాణం

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు ఎక్కువగా కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి వారిని దర్శించుకుంటున్నారు. అంతేకాకుండా శివాలయం చెంతనే ఉన్న ప్రసాద విక్రయశాలకు వెళ్లి ప్రసాదం కొనుగోలు చేసి మెట్ల మార్గంలో బస్‌బే వద్దకు వెళ్తుంటారు. ఈ మార్గంలో ఎటువంటి నీడ లేకపోవడంతో పాటు మండుటెండకు కృష్ణశిల స్టోన్ ఫ్లోరింగ్‌పై వెళ్లే భక్తులకు కాళ్లు కాలుతున్నాయి. దీనిని గమనించిన అధికారులు ప్రసాద కాంప్లెక్స్‌కు ఆనుకొని ఉన్న మెట్ల మార్గంలో రేకులతో షెడ్డును ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన పనులను సిబ్బంది వేగంగా చేస్తున్నారు.

వ్రత మండపం వద్ద వాహన పూజలు

యాదగిరిగుట్ట: నూతన వాహనాలు కొనుగోలు చేసిన యాజమానులు ఎక్కువగా యాదాద్రీశుడి చెంత పూజలు చేయించడం సంప్రదాయంగా వస్తుంది. భక్తుల సౌకర్యార్థం వాహన పూజల షెడ్డును శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపం వద్ద ఏర్పాటు చేసి, భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆలయాభివృద్ధి ముందు మొదటి ఘాట్ రోడ్డులో ఈ వాహన పూజల షెడ్డు ఉండేది. ఘాట్‌రోడ్డుతో పాటు కొండ చుట్టూ గ్రీనరీ పనులు చేపట్టడంతో ఈ షెడ్డును పాత గోశాలలోకి మార్చారు. అక్కడే వ్రత మండపం సైతం ఉండేది. ఇటీవలే శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపాన్ని పూర్తిచేసి దానిని అందుబాటులో తీసుకురావడంతో భక్తుల సౌకర్యార్థం వ్రత మండపం పక్కనే వాహనాల పూజల కోసం షెడ్డును ఏర్పాటు చేసి వినియోగిస్తున్నారు. ఇక్కడ వాహన పూజలు చేసుకున్న భక్తులు నేరుగా మూడవ ఘాట్ రోడ్డు నుంచి యాదాద్రి కొండపైకి వెళ్లనున్నారు.



వ్రత మండపం పక్కన ఏర్పాటు చేసిన షెడ్డులో వాహన పూజలు చేస్తున్న అర్చకులు

మద్యం తాగేందుకు వచ్చి.. మురుగు గుంటలో శవమై..

- అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి
- మఠంపల్లిలో వెలుగుచూసిన ఘటన
- మృతుడు ఆంధ్రా ప్రాంత వాసి

మఠంపల్లి: అదృశ్యమైన యవకుడు మురుగు గుంటలో శవమై తేలాడు. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలో బుధవారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం సారంగపల్లి గ్రామానికి చెందిన గల్లా నతానియేల్ (26) స్నేహితులతో కలిసి తరచూ మద్యం సేవించేందుకు మఠంపల్లి మండల కేంద్రానికి వచ్చి పోతుంటాడు. ఈ నేపథ్యంలోనే నతానియేల్ ఈ నెల 6వ తేదీన ఇద్దరు స్నేహితులతో కలిసి మఠంపల్లిలోని ప్రధాన రహదారి పక్కన గల పంజాబీ దాబాకు వచ్చారు. అక్కడ మద్యం సేవించిన తర్వాత ఇద్దరు స్నేహితులు స్వస్థలానికి వెళ్లిపోగా నతానియేల్ ఇంటికి వెళ్లలేదు. దీంతో మరుసటి రోజు (7వ తేదీన) అతడి తండ్రి ప్రసాదరావు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అదృశ్యం కేసు నమోదైంది. అయితే, బుధవారం ఉదయం స్థానికులు మురుగు గుంటలో తేలిన మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది. సమాచారం మేరకు ప్రసాదరావు, ఇతర కుటుంబ సభ్యులు వచ్చి మృతుడు నతినియేల్ అని గుర్తుపట్టారు. హత్య చేసి మురుగు గుంటలో పడవేశారని, నిందితులను కఠినంగా శిక్షించాలని కొద్ది సేపు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించారు. కాగా, పోలీసులు మృతదేహాన్ని వెలికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. అయితే, మఠంపల్లికి నతానియేల్‌తో పాటు వచ్చిన ఇద్దరు స్నేహితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ప్రసాదరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మఠంపల్లి ఎస్ఐ ఇరుగు రవి తెలిపారు.